05042025-MAI-06_Layout 1 4/5/2025 3:30 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# మదపుటేనుగును బంధించిన నెమలీకలు



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

**'ఇది అరుపు కాదు.. ఏడుపు. నెమలి పిట్టల ఏడుపు. ఆదమరిచిన యాళ్ల ఆపద గుర్తెరిగి మగ నెమిళ్లు ఒర్రుకుంట ఒప్పనోన్ని గెదిమేందుకు గొంతు పోను పెడుతున్న పొగుల్ ఘాతలు. తావు చెదిరిన తల్లి నెమిళ్లు, పిల్ల నెమిళ్లు గొల్లు గొల్లున ఏడుస్తున్న ఏడుపులు' అని చెంచు అంజన్న అనుభవం చెప్పిండు. నెమలి ఏడుపు అడవికి అరిష్టమని పూర్తి వీడియో చూడటానికి కూడా అంజన్న ఇష్టపడలేదు.**



అర్ధరాత్రి వేళ సర్కారు పంపిన బుల్డోజర్లు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల మీద పడి గ్రీన్ హంట్ చేస్తున్న వీడియో క్లిప్పింగ్ ఒకటి సోషల్ మీడియాలో నిమిషాల్లో వైరలైంది. 40.. 50 బుల్డోజర్లు ఏకధాటిగా వృక్షాలను కొరికేస్తుంటే.. ఆ ఆవాసంలోని నెమళ్లు చేస్తున్న హృదయ విదారక ఆర్తనాదాలు హృదయం ఉన్న ప్రతి మనిషిని కలచివేశాయి. ఇదే వీడియో క్లిప్పింగ్‌ను అచ్చంపేట జర్నలిస్టు మిత్రుడు చందు నాయక్ నల్లమల దట్టమైన అడవిలోని ఓ పెద్దమనిషి చెంచు అంజన్నకు చూపించాడు. ఇది నెమలి పిట్టల అరుపు కాదు.. ఏడుపు అని అంజన్న ఆవేదన చెందాడు. నెమలి తొమ్మిది తీర్లు పలుకుతుందట.. ఆకర్షణ, సంభోగం కోసమే ఏడు తీర్లుగా మగ నెమలి అరుస్తుంటే.. ఆడ నెమలి మురుస్తుందట. మిగిలిన రెండు శబ్దాలు ఒకటి ప్రమాదం పొంచి ఉన్నప్పుడు శత్రువును భయపెట్టడానికి మగ నెమలి చేసే హెచ్చరికలు.. మరోటి ప్రమాదం తప్పదని తెలిసి ఆడ నెమలి ఏడుస్తుంటే.. తల్లిని చూసి పిల్ల నెమళ్లు గొల్లుగొల్లున ఏడుస్తాయని వివరంగా చెప్పిండు. అట్లని అంజన్న ఆర్నిథాలజిస్టు కాదు. నాగరికపు మాయ, రాజకీయ మర్మం తెలియని నిఖార్సయిన అడవి మనిషి. అడవి మీద అంతులేని పట్టున్న చెంచుజాతి ఆటవికుడు. యురేనియం తవ్వకాల కోసం నల్లమల అడవి మీదికి సర్కారు మళ్లీ జేసీబీలు పంపింది అనుకున్నాడట. గుడిసెలకు ఉరికి విల్లంబు అందుకున్నడు.. తనవాళ్లకు కేకేసి పిలిచిండు. సూనగాండ్లు దొంగ దెబ్బకొడుతన్నర్.. 'ఏన్నో సూపిద్దు పా సారు' అనుకుంటా యుద్ధానికి సిద్ధమైండు. ఇక్కడ కాదు పట్నంల అని వారిస్తుండగా.. ఏన్నైతేంది. పిట్టల ఏడుపు ఎవరికి సుతి ముద్ద లేదా? అని జర్నలిస్టు చందును నిలదీసిండట.

'పిట్టల ఏడుపు ఎవరికి సుతి ముద్ద లేదా?' అని అంజన్న ఆవేశంతో అన్నాడో.. ఆవేదనతోనో అన్నాడో గానీ, నెమలి తల్లి పిల్లల ఏడుపు ధర్మ దేవతకు సుతి ముట్టింది. అర్ధరాత్రి వేళ జాతీయ పక్షులు చేసిన హాహాకారాలు తెల్లారేసరికి తెలంగాణ జాతిని మేల్కొల్పినయి. ధర్మాసనం తలుపు తట్టి, మదపుటేనుగు ఒగరుబోతుతనాన్ని దించింది. ప్రభుత్వ పంచన చేరిన ప్రకృతి కవులు, పదవులు అనుభవిస్తున్న ఉద్యమకారులు ఇప్పటికీ నోరు తెరవటం లేదు. రుషికొండ అని, మడ అడవులని గుండెలు బాదుకునే పరాయి మీడియాకు హైదరాబాద్ అంతర్గర్భంలోని ఆటవిక విధ్వంసం కనిపించలేదు. కానీ, రక్తమాంసాల స్పర్శకు సోషల్ మీడియా స్పందించింది. పాలకుల దాష్టీకాన్ని నిష్కర్షగా ఖండించింది. అటవీ భూమిని కాపాడటానికి విద్యార్థులు చేస్తున్న పోరాటానికి అండగా నిలబడింది.

నిజమే..! రెవెన్యూ రికార్డుల ప్రకారం... హెచ్‌సీయూ భూములు అటవీ భూములు కావు. కానీ, వేల ఏండ్లనాటి నుంచి జంతుజాల జీవనానికి ఆవాసంగా మారిన అటవీ ఆవరణం. బయో డైవర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం 400 ఎకరాల విస్తీర్ణంలో 40 వేల చెట్లతో ఎదిగిన స్క్రబ్ అడవి. పుట్టగొడుగుల ఆకృతి చిలప రాళ్లు.. 72 చెట్ల జాతులు, క్షీరదాలు, సరీసృపాలు, 230 రకాల పక్షులున్నాయి. మచ్చల జింకలు, బెంగాల్ మానిటర్ బల్లులు, కొండచిలువలు, నెమళ్లు, కుందేళ్లు, గుడ్లగూబలు, ఫ్లెమింగో పక్షులు, నక్షత్ర తాబేళ్లు, అడవిపందుల ఆవాసం. మార్కింగ్ నట్, మష్రూమ్ రాక్స్ ఇక్కడి ప్రత్యేకత. 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ఇక్కడ పెరిగే ప్రతి జీవికి జీవించేహక్కును కల్పించాలి. 2002 ఏపీ వాల్టా చట్టం ఇక్కడ పెరిగే ప్రతి చెట్టుకు భద్రత కల్పించాలి. 1912 అటవి, పక్షుల భద్రత చట్టం ఇక్కడ ఎగిరే ప్రతి పిట్ట ప్రాణాలకు భరోసా కల్పించాలి. ప్రైవేట్ భూమి అయినప్పటికీ వన్య జీవుల మనుగడకు చట్టపరమైన భద్రత కల్పించాల్సిన బాధ్యత అటవీశాఖ మీద ఉన్నది. దాన్ని ఆ శాఖ సంపూర్ణంగా విస్మరించింది.

2003లో నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గచ్చిబౌలిలోని సర్వే నం.25లోని ఇదే భూమిని బిల్లీరావు అనే వ్యక్తి సృష్టించిన ఐఎంజీ అనే సంస్థకు అప్పగించారు. ఎకరానికి రూ.50 వేల చొప్పున 400 ఎకరాలు రూ.2 కోట్లకు అమ్మినట్టుగా ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులను అప్పటికే అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2006, సెప్టెంబర్‌లో రద్దుచేసింది. వైఎస్సార్ ప్రభుత్వ నిర్ణయాన్ని బిల్లీరావు కోర్టులో సవాల్ చేశారు. ఇక అప్పటినుంచి కోర్టులో కేసు నడుస్తున్నది గానీ, భూమి మాత్రం హెచ్‌సీయూ ఆధీనంలో ఉన్నది. అప్పటినుంచి హైదరాబాద్ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు సంరక్షించి సంపూర్ణ అరణ్యంగా మలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ 400 ఎకరాల చుట్టూ ఇనుప కంచె వేయించారు. హైకోర్టులో ఉన్న కేసుపై సమీక్షించి ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించారు. కేసీఆర్ దిగిపోయాక నాలుగు నెలలకు రాష్ట్ర ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. కోర్టు తీర్పు రావటమే ఆలస్యం సీఎం రేవంత్‌రెడ్డి కండ్లు ఆ భూముల మీద పడ్డాయి. మొదట ఆ భూములను కొల్లేటరల్ సెక్యూరిటీగా పెట్టి రూ.10 వేల కోట్ల అప్పు తీసుకున్నారు. తాజాగా ఆ భూమిలో చెట్లు నరికివేసి, వన్యప్రాణులను చంపి మొత్తంగా ప్లాట్లు చేసి అమ్మటానికి సాహసం చేసింది సర్కార్. మాస్టర్ ప్లాన్ తయారు చేసి వేలంగా సహకారం అందించేందుకు ట్రాన్సాక్షన్ అడ్వైజరీ కన్సల్టెంట్ ఎంపిక కోసం రిక్వెస్ట్ ప్రపోజల్ జారీచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పుడన్నీ ఆగిపోయాయి.

> **హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ఆక్రమించే దుర్మార్గమైన ప్రభుత్వ ప్రయత్నాన్ని ప్రతిఘటించిన విద్యార్థులపై లాఠీల కాఠిన్యం, అక్రమ కేసులు, అరెస్టులు క్రూరమైనవే... అయినా రాష్ట్రంలో ప్రజాస్వామిక స్ఫూర్తి మరింత వేగవంతం కావటానికి, విస్తరించడానికి హెచ్‌సీయూ విద్యార్థుల ఉద్యమం ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. ఆరు గ్యారంటీలని చెప్పి కాళేశ్వరం, శ్రీరామ్‌సాగర్, సీతారామసాగర్, పాలమూరు, భీమా, నెట్టెంపాడు ఆరు ప్రాజెక్టులను ఎండబెట్టింది. మార్పునకు ఓటేసిన ఫలితం.. తెలంగాణ సకలజనులను కన్నీళ్లు పెట్టిస్తున్నది. గురుకుల, ఆశ్రమ పాఠశాలలపై కక్షగట్టింది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. 15 నెలల పాలనతో రోజుకు ఇద్దరు చొప్పున మట్టిపూలు అర్ధాంతరంగా రాలిపోతున్నయి.**

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలనే అక్కసునే ముందేసుకొని చేస్తున్న పరిపాలనకు తెలంగాణ పల్లెలు గోడు గోడున ఏడుస్తున్నయి. ఈ ఏడుపు ఆ దేవునికి ఎన్నడు సుతి ముడుతుందో అని రైతాంగ, విద్యార్థి, మహిళాలోకం ఎదురుచూస్తున్నది. నెమలీకలు కలిసి బంధించిన మదపుటేనుగు ఉదంతంతో ఉద్యమ సమాజం దృష్టిలో, ప్రజల దృష్టిలో కాంగ్రెస్ ప్రభుత్వం పలుచబడ్డది. ఆ పార్టీ అధినాయకుడు రాహుల్‌గాంధీ మైలేజీని పన్నెండు ఆమడల దూరం వెనక్కినెట్టింది. ఇదే మోకా మీద తెలంగాణ భవిష్యత్తు కోసం 'ఔర్ ఏక్ ధక్కా పక్కా' అనిపిస్తున్నది.

# విస్తరిస్తున్న విష సంస్కృతి



జి.అనసూయ

**పుట్టినప్పుడు ప్రతిబిడ్డ అందంగానే ఉంటుంది. ఒక్క మనిషే కాదు, ప్రకృతిలోని ప్రతి జీవి, మొక్క అన్ని లేలేతగా, సుకుమారంగా, అమాయకంగా అందంగానే ఉంటాయి. ఒక్క మనిషి మాత్రమే తమలో ఉన్న తేడాలకు అందం అనే పేరు పెట్టి ఒక భావజాలాన్ని కల్పించుకున్నాడు. మనుషులకే కాక జంతువులకు, పక్షులకు, పుష్పాలకు, ఆకులకు, రంగులకు, భూమికి, ఆకాశానికి కూడా ఈ సౌందర్య భావనను ఆపాదించి కొన్ని అందమైనవని, మరికొన్ని అందవిహీనమైనవని వర్ణిస్తారు.**

తొలిదశలో మనిషి అడవుల్లో జీవిస్తూ ఉండేకాలంలో ఆహార సేకరణ, వేట, తొలిదశ ఆహార ఉత్పత్తి కాలంలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమాన దేహ దారుఢ్యాన్ని, బలాన్ని కలిగి ఉండేవారు. క్రమంగా స్త్రీ పురుషుల మధ్య పని విభజన జరిగింది. పిల్లలు కనడానికి, పెంచడానికి, గృహ సంబంధ పనులకు మాత్రమే స్త్రీలు పరిమితమయ్యారు. క్రమంగా శరీర ఆకృతిలో కూడా మార్పులు వచ్చాయి. ఇదంతా ఒక్క రోజులో జరిగింది కాదు, కొన్ని వందల, వేల ఏండ్లు పట్టి ఉండవచ్చు. క్రమంగా దాంపత్య సంస్కృతి వేళ్లూనుకొని ఆస్తిగా, అలంకార వస్తువుగా, వారసులను అందించే వారధిగా, వినోదాన్ని పంచే విలాసినిగా స్త్రీ మారాక, స్త్రీ శరీరం పట్ల, అందం పట్ల ప్రత్యేక ఆసక్తి, శ్రద్ధ ఏర్పడ్డాయి. దాంపత్య వ్యవస్థకు సమాంతరంగా వేశ్యా సంస్కృతి కూడా విస్తరించింది. ఆకర్షణీయంగా, శృంగార దేవతగా, కళాకారిణిగా ఉండటం వేశ్య లక్షణం అయితే, భర్తలను ఆకట్టుకోవడానికి తమ పట్ల వారి ఆకర్షణ తగ్గకుండా ఉండటానికి భార్యల తహతహ. ఎవరికి వాళ్లు అందుబాటులో ఉన్న వాటితో తమను తాము సౌందర్యవతులుగా నిరూపించుకోవడానికి స్త్రీలు ఉబలాటపడటం మొదలైంది. పెట్టుబడిదారీ సంస్కృతి విస్తరించాక, సౌందర్య సాధనాల పరిశ్రమ అత్యంత లాభదాయకమని గ్రహించిన ఉత్పత్తిదారులు స్త్రీలకు సౌందర్యం పట్ల ఉన్న ఆసక్తిని, బలహీనతను ఉపయోగించుకొని కాస్మోటిక్స్‌ను అమ్ముకోవడానికి ప్రకటనలను ప్రయోగించడం ప్రారంభించారు. సినిమా యాక్టర్లను, మోడల్స్‌ను అందుకు వినియోగిస్తున్నారు. అందాల భామలతో ప్రకటనల ద్వారా వేల కోట్ల లాభాలను ఆర్జిస్తున్నారు. అత్యంత చౌక ముడిసరుకుతో తయారయ్యే కాస్మోటిక్స్‌ను వందల రెట్ల ఖరీదుతో అమ్ముకుంటూ కోట్ల కొద్దీ డబ్బును ప్రచారానికి ఖర్చుపెడుతున్నారు. సౌందర్య ఉత్పత్తులైన క్రీములు, పౌడర్లు, మాయిశ్చరైజర్లు, లిప్‌స్టిక్‌లు, లేపనాలు, సెంటులు, అలంకరణ వస్తువులు, ఫ్యాషన్ దుస్తులు, ఎత్తు పెంచే ఫుడ్ డ్రింకులు, ఆరోగ్యాన్ని పెంచే టానికులు, తల వెంట్రుకల దగ్గర నుంచి కాలిగోటి వరకు ప్రతి అంగాన్ని అందంగా మార్చుతాయని ప్రకటనల ద్వారా ప్రజల మెదళ్లలోకి ఎక్కించి లాభాలను దండుకుంటున్నారు. వీటి ఉపరితల రూపమే నేటి అందాల పోటీలైన మిస్ వరల్డ్ పోటీలు.

అందాల పోటీల సంస్కృతి పెట్టుబడిదారీ దేశాల్లో 20వ శతాబ్దం నుంచి ఉనికిలోకి వచ్చింది. అమెరికా దీనికి మెరుగులు దిద్దింది. 1921లో మొదటిసారిగా అమెరికాలో మొదలై ప్రస్తుతం ఏటా 1.5 లక్షలకు పైగా పోటీలు అనేక స్థాయిల్లో, సందర్భాల్లో జరుగుతున్నాయి. సామ్రాజ్యవాద సంస్కృతి విస్తరణలో భాగంగా ఈ సంప్రదాయం 3వ ప్రపంచ దేశాల్లోనూ విస్తరించింది. మన దేశంలో మిస్ ఇండియా, మిస్ నాని క్వీన్, మిస్ గుంటూరు, మిస్ విశాఖ, మిస్ ఫెమినా, మిస్ కాలేజీ వంటి పేర్లతో నిర్వహించబడుతున్నాయి. ధనిక, ఎగువ మధ్యతరగతి వర్గంలో బాగా ప్రచారంలో ఉన్న ఫెమినా, ఈవ్స్ వీక్లీ వంటి పత్రికలు ఈ పోటీలకు సారథ్యం వహిస్తున్నాయి. ఈ పత్రికల ఎడిటర్లు తాము స్త్రీ విముక్తికి కృషిచేసే అభ్యుదయ వాదులమని, ఫెమినిస్టులమని చాటుకుంటారు. బడా కార్పొరేట్ కంపెనీలు వీటిని స్పాన్సర్ చేస్తాయి.

సామ్రాజ్యవాద శక్తులతో చేతులు కలపడం, మూడో ప్రపంచ దేశాల పాలకులు జాతీయత, జాతీయ స్వాతంత్ర్యం, ఆర్థిక స్వావలంబనలకు తిలోదకాలిచ్చే క్షీణ సంస్కృతి ప్రపంచమంతా విస్తరిస్తున్నది. జాతీయ విలువల విధ్వంసం, మత్తు పదార్థాలు, మద్యం, మహిళలపై హింస,




అశ్లీల సాహిత్యం, అవినీతి, దురాశ, వస్తు వినియోగ వ్యామోహం, విలువల పతనం వంటివి వేగంగా వ్యాప్తిచెందాయి. అందాల పోటీలు అందులో భాగమే. స్థానిక స్థాయి నుంచి దేశీయ, ప్రపంచస్థాయి వరకు అందాల పోటీల పేరుతో స్త్రీల శరీరాలను వ్యాపార సాధనంగా వినియోగించుకునే వినిమయ సంస్కృతి స్త్రీల అలవాట్లలో తీవ్రమైన మార్పులు తెచ్చింది. కేవలం వస్తువులు తయారుచేయడం వాటిని అమ్ముకోవడమే కాదు, ఆ వస్తువులకు కొనుగోలుదారులను, వినియోగదారులను కూడా అంటే మార్కెట్‌ను కూడా తయారు చేసుకుంటున్నారు. భారత్‌లో 1996లో బెంగళూరులో, 2024లో ముంబైలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. 1996లో అమితాబచ్చన్ ఏబీసీ కంపెనీ కో హోస్ట్‌గా వ్యవహరించగా, 2024లో కరణ్ జోహార్ అండ్ మేఘనా యంగ్ హోస్టుగా ఉండగా ఈసారి 72వ మిస్ వరల్డ్ పోటీలను ఏకంగా తెలంగాణ ప్రభుత్వమే మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌తో కలిసి నిర్వహిస్తున్నది. 72వ మిస్ వరల్డ్ పోటీలు మే 7వ తేదీ నుంచి ప్రారంభమై మే 31న గ్రాండ్ ఫినాలేతో ముగుస్తాయి. ఈ పోటీల వల్ల పర్యాటక, చేనేత పరిశ్రమ, సంప్రదాయ ఆహారం, ఆతిథ్యం వంటి రంగాలు అభివృద్ధి చెందుతాయని, మన సంస్కృతి దేశ విదేశాలకు విస్తరిస్తుందని నిర్వాహకులు చెప్తున్నారు. సామ్రాజ్యవాద సంస్కృతిలో టూరిజం అభివృద్ధి అంటే ఇప్పటికే టూరిజం విస్తృతంగా పెరిగిన బ్యాంకాక్, సింగపూర్, థాయిలాండ్ లాంటి పర్యాటక కేంద్రాలు భారీ వ్యభిచార కేంద్రాలుగా మారాయని గుర్తుంచుకోవాలి. అందాల పోటీల మోజులో పడిన యువతులు మోడలింగ్, ప్రకటన రంగంలో మోడల్స్ గాను సినిమా నటులు గాను, టూరిజం పేరుతో ఖరీదైన భారీ వ్యభిచారాన్ని వ్యాపార, రాజకీయ ప్రయోజనాలకు పెట్టుబడిగాను సాధనాలవుతారు. అందాల పోటీల్లో అత్యంత అందమైన యువతిని బ్యూటీ క్వీన్‌గా ఎంపిక చేయడానికి పాటించే ప్రమాణాలు ఏమిటంటే ఎత్తయిన ఎద, సన్నని నడుం, ఎద కన్నా పెద్దదైన తుంటి భాగం, 50 కిలోలకు మించని బరువు, 20 డిగ్రీల భుజం వంపు మొత్తం మీద 34, 24, 35గా ఈ కొలతలను విధిస్తారు. ఈ కొలతలు కృత్రిమమైనవి, కచ్చితమైనవి, వికృతమైనవి కూడా. ఎన్నికైన అందాల భామ ఒక ఏడాది పాటు నిర్వాహకుల చెప్పుచేతల్లో ఉండాలి. సామాజిక స్పృహ కాని, దోపిడీ వ్యతిరేక వైఖరిగాని, రాజకీయ అభిప్రాయాలు కానీ కలిగి ఉండకూడదు. నిర్వాహకుల మాట జవదాటకూడదు.

సౌందర్య దృష్టి మానవ సహజమైనది. సౌందర్య కోణానికి సాంస్కృతిక కోణం తప్పనిసరి. మనుషుల్లో అందం అనేది అనేక సామాజిక సాంస్కృతిక విలువల ఆధారంగా ఉంటుంది. బాహ్య సౌందర్యాన్ని కాకుండా అంతః సౌందర్యమైన మేధస్సును, తెలివితేటలను కూడా సౌందర్యంగానే భావించాలి. సనాతన ధర్మాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను నిత్యం వల్లించే మన దేశంలో స్త్రీల నగ్న సౌందర్యాన్ని ప్రదర్శనకు పెట్టడం ఏ విలువల ప్రకారం జరుగుతున్నది? ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం కష్టజీవులకు, అమాయకత్వానికి, పేదరికానికి, పోరాట వారసత్వానికి ప్రతీక. నిరంకుశ నైజాం సర్కార్‌నే తరిమికొట్టి ఆత్మగౌరవాన్ని, జాతి ఔన్నత్యాన్ని కాపాడుకున్న వారసత్వం ఈ నేల బిడ్డలది. ఈ గడ్డపై మహిళల అందాలకు కొలమానాలు పెట్టి సర్కస్‌లో జంతువుల వలె ప్రదర్శించడాన్ని తెలంగాణ మహిళలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. వ్యాపారసంస్థల లాభాల కోసం, కార్పొరేట్ కంపెనీల స్వార్థ ప్రయోజనాల కోసం, ఆడవాళ్లను ఉపయోగించుకునే సంస్కృతికి వ్యతిరేకంగా గొంతు విప్పాల్సిన బాధ్యత ప్రగతిశీల శక్తుల, సంస్థల, వ్యక్తుల, కళాకారుల, సంఘాల, రచయితల, సమస్త ప్రజలపై ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా స్త్రీలు చైతన్యవంతులు అవుతున్నారు. అందాల పోటీల నీచ సంస్కృతిని ప్రతిఘటిస్తూ వివిధ ప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఉద్యమాలను నిర్వహిస్తున్నారు. దోపిడీ విముక్తిలోనే స్త్రీ విముక్తి ఉందన్నది అక్షర సత్యం. స్త్రీలు మాంసపు ముద్దలు కాదు, వ్యక్తిత్వం ఉన్న మనుషులు. అందాల బొమ్మలు కాదు, ప్రపంచాన్ని పోషిస్తున్న శ్రమ జీవులు. చూడాల్సింది శరీర సౌందర్యం కాదు, శ్రమైక్య సౌందర్యం అని గుర్తెరగాలి. శ్రమ సామర్థ్యాలు, నైపుణ్యాలు, పని ప్రామాణికతలు, గుణాత్మకతలు గుర్తించి ప్రదర్శిస్తే ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ఉత్పత్తి శ్రమలో స్త్రీ శక్తిని అనుసంధానించడమవుతుంది. సమష్టి ప్రయోజకత్వంగా శ్రమ సౌందర్యం, పని సంస్కృతి భాసిల్లుతాయి.

(వ్యాసకర్త: పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు)




## మన రైతులకు అమెరికా ముప్పు



ట్రంప్ బెదిరింపులకు, అమెరికా సామ్రాజ్యవాదానికి మోదీ సర్కారు లొంగిపోయింది. జాతీయత గురించి రాత్రి, పగలు ఊదరగొట్టే బీజేపీ సర్కారు అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను మన పౌరులపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నది. ఈ పరిస్థితిలో మన రైతులకు మరింత నష్టం వాటిల్లుతుంది.

- యోగేంద్ర యాదవ్, ప్రముఖ ఎన్నికల విశ్లేషకుడు



# మోకరిల్లిన మోదీ



వెంకట్ పర్సా

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు భారత ప్రధాని మోదీ సన్నిహితంగా ఉన్నారని భావిస్తున్న వేళ భారత్‌పై అమెరికా 27 శాతం వాణిజ్య సుంకాలను విధించడం ఆశ్చర్యానికి గురిచేసింది. తొలుత ఈ సుంకాన్ని 26 శాతంగా నిర్ణయించినప్పటికీ వైట్‌హౌస్ దాన్ని27 శాతానికి పెంచింది.**

మోదీ ప్రభుత్వం మాత్రం ఈ సుంకం 10-15 శాతంగా ఉంటుందని భావించింది. కానీ, ఇప్పుడు ఏకంగా 27 శాతానికి పెంచడం రుచించడం లేదు. రెండు ప్రధాన వాణిజ్య భాగస్వాములైన మెక్సికో, కెనడాపై విధించిన 25 శాతం సుంకాలను ఇది మించిపోవడం గమనార్హం. జపాన్, మలేసియాపై 24 శాతం సుంకం విధించగా భారత్‌పై ఇంకా ఎక్కువ విధించడం విశేషం. చైనాపై అమెరికా 54 శాతం భారీ సుంకాలను విధించినప్పటికీ ఇది భారత్‌కు ఏ మాత్రం ఉపశమనాన్ని కలిగించదు. ఎందుకంటే, చైనా సమర్థవంతమైన ఉత్పాదకత కలిగిన ఆర్థికశక్తిగా ఉన్నది. ఇక, వియత్నాంపై 46 శాతం, బంగ్లాపై 37 శాతం, థాయిలాండ్‌పై 36 శాతం సుంకాలను అమెరికా విధించింది. ఎందుకంటే ఈ దేశాల్లో కార్మిక శక్తి చాలా చౌకగా దొరుకుతుంది.

మోదీ ప్రభుత్వం అమెరికాను మిత్రదేశంగా భావిస్తున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై భారీ వాణిజ్య సుంకాలను విధించింది. దారుణమైన విషయం ఏమంటే.. భారత్‌ను ఘోరంగా విమర్శించే అమెరికా వాణిజ్య శాఖ నివేదికను ట్రంప్ మీడియాతో పంచుకోవడం. ఈ నివేదిక 2014 తర్వాత భారతదేశం రక్షణాత్మక వాణిజ్య విధానాలను అవలంబించిందని విమర్శించింది. దీని ఫలితంగా, భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే బంగారు ఆభరణాలు, కార్పెట్లు, పాలు, బియ్యం, ఇతర వస్తువులు అధిక సుంకాలకు గురికావాల్సి వస్తున్నది. అమెరికాలో భారీ ఎన్నారై మార్కెట్ కారణంగా ఇవి సుంకాల తీవ్రతను ఎదుర్కొంటున్నాయి. అయితే, మోదీ ప్రభుత్వం దీన్ని తేలికగా తీసుకున్నది. దీనిపై అధికారికంగా స్పందించడానికి సాహసించలేదు. ట్రంప్‌కు దగ్గరగా ఉన్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఐరోపా కమిషన్ అధ్యక్షుడు, ఆస్ట్రేలియా ప్రధాని సహా అనేక మంది ప్రపంచ నాయకులు అమెరికా నిర్ణయంపై తీవ్రంగా స్పందించారు. ఈ నిర్ణయం అమెరికాకు ప్రయోజనం చేకూర్చదన్నారు. కానీ, మోదీ ప్రభుత్వం మాత్రం ఆ పాటి ధైర్యం చేయలేకపోయింది. కనీసం అధికారికంగా స్పందించేందుకు అవసరమైన ధైర్యాన్ని కూడగట్టుకోలేకపోయింది. మోదీ ఈ అంశంపై మౌనం పాటించడమే కాకుండా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కూడా నోరెత్తకుండా చేశారు. వాణిజ్య మంత్రిత్వ శాఖ మాత్రం దీన్ని పరిశీలిస్తామని ఒక సాధారణ ప్రకటన మాత్రమే ఇచ్చింది.

అమెరికా వాణిజ్య సుంకాలను పెంచుతుంటే, అదే సమయంలో భారత ప్రభుత్వం మాత్రం అమెరికాకు పలురకాల రాయితీలిస్తూ ట్రంప్ ఎదుట మోకరిల్లుతున్నది. అధిక ధరల బైక్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలు, బోర్బన్ వంటివాటిపై భారత ప్రభుత్వం సుంకాలను తగ్గించింది. అమెరికన్ టెక్ కంపెనీలకు హాని కలిగించే డిజిటల్ సేవల పన్నును కూడా రద్దుచేసింది. ఇందుకు సంబంధించిన సంకేతాలు ఇప్పటికే కేంద్ర బడ్జెట్‌లో కనిపించాయి. ఫిబ్రవరి 1న సమర్పించిన బడ్జెట్‌లో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఈ రాయితీలను ప్రధాన బడ్జెట్‌లో కాకుండా అనుబంధాల్లో దాచిపెట్టారు. దీనిద్వారా, మోటార్ సైకిళ్లపై 50 శాతం, ఎలక్ట్రిక్ వాహనాలపై 85 శాతం దిగుమతి సుంకాలను తగ్గించారు. ఈ నిర్ణయాలు అమెరికా కంపెనీలకు లాభదాయకంగా ఉంటాయి. ఉదాహరణకు, మోటార్ సైకిళ్లపై సుంకం తగ్గించడం హార్లే డేవిడ్సన్‌కు ఉపయోగపడుతుండగా, ఎలక్ట్రిక్ వాహనాలపై తగ్గింపు టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌కు లాభదాయకంగా మారనున్నది. అయితే, భారతదేశపు స్థానిక కంపెనీలైన మహీంద్రా, టాటా, మారుతీ కంపెనీలను ఇది తీవ్రంగా దెబ్బతీయనున్నది.

నిజానికి అమెరికా విధించిన వాణిజ్య సుంకాలు కథలో ఒక భాగమే. అసలైన పెద్ద కథ భారత ప్రభుత్వం అమెరికాకు మరింత రాయితీలు ఇచ్చిన విషయంలో ఉన్నది. వాణిజ్య సుంకాలు పెరగడం, భారత ప్రభుత్వం ఇచ్చే రాయితీలతో కలిపి పరిశీలిస్తే, భారత్ లాభపడుతున్నదా? లేక, నష్టపోతున్నదా? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. మోదీ మద్దతుదారులు దీన్ని మరోవిధంగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. వారు దీన్ని భారత్-అమెరికా సంబంధాలను మలుపు తిప్పే పరిణామంగా చిత్రీకరిస్తున్నారు. అయితే, భారత వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికాకు మరిన్ని సడలింపులివ్వాలని ప్రతిపాదనలున్నాయి. భారత వ్యవసాయ రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలురకాలుగా సాయం చేస్తున్నాయి. దీనిలో రుణాలపై రాయితీలు, రుణమాఫీ, పంటబీమా, ఎరువులు, ఇంధనం, విద్యుత్తు, విత్తనాల రాయితీలు వంటివి ఉన్నాయి. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి భారత్ అంగీకరించినట్టయితే, భారత రైతులు తీవ్రమైన ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం భయానకంగా మారుతున్నది. 37 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులును కలిగి ఉన్న భారత్ తన ప్రయోజనాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్నది. కానీ, మోదీ ప్రభుత్వం అమెరికాతో సంబంధాలను బలోపేతం చేయడానికి అతి త్వరగా అడుగులు వేస్తున్నది. ఏప్రిల్ 2న అమెరికా విధించిన పరస్పర వాణిజ్య సుంకాల నిర్ణయానికి ముందే, మోదీ ప్రభుత్వం అమెరికాతో చర్చలు ప్రారంభించింది. ప్రస్తుతం, భారత్, అమెరికా మధ్య బహుముఖ వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ త్వరలోనే దీనిపై సంతకం చేసే అవకాశం ఉన్నది. 2030 నాటికి భారత్-అమెరికా వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచే ప్రణాళిక అమెరికాకు ఎక్కువ ప్రయోజనకారిగా మారనున్నది. భారత్ ఇంధన వ్యయాలను అధికంగా చెల్లించాల్సి వస్తుంది. అలాగే వ్యవసాయం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉన్నది. మొదటిసారి, విదేశాంగ విధానాలను ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే ప్రయత్నం జరుగుతున్నది. జనసంఘ్ అమెరికాకు మద్దతుగా ఉన్న రాజకీయం చేపట్టింది. 1977-79 జనతా ప్రభుత్వం కాలంలో అమెరికాతో సంబంధాలను పెంచే ఉద్దేశంతో వాజపేయి 'నిజమైన అలీన విధానం' అనే సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. 1980 ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భవించినప్పటి నుంచీ అమెరికాకు అనుకూలంగా ఉన్న విధానాన్ని కొనసాగించింది. 2003లో ఇరాక్ యుద్ధంలో అమెరికాకు మద్దతుగా భారత్ చేరేలా వాజపేయి ప్రభుత్వం ప్రమాదకర చర్యలు తీసుకున్నది. అప్పటి ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ వాషింగ్టన్‌లో పర్యటించి ఇరాక్‌తో యుద్ధంలో అవసరమైన మిలిటరీ సాయం అందిస్తామని అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్‌కు హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి మోదీ ఎప్పుడూ అమెరికాకు దగ్గరగా ఉండాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నారు. ఈ విషయంలో ఎన్నడూ దాపరికం వహించలేదు. ఇప్పుడు, అమెరికా విధించిన వాణిజ్య సుంకాలపై మోదీ ప్రభుత్వం మౌనం పాటించడం ఆ దిశగా జరిగిన మరో అడుగుగా కనిపిస్తున్నది.